# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## గుమ్మడి

### (కినిమా – 1955, మార్చి సంచిక నుంచీ)



స్కెచ్

గుమ్మడి
వెంకటేశ్వరరావు

సినిమా చిత్రాల రక్తికట్టటానికి రకరకాల వ్యక్తిత్వమూ, నటనా సామర్థ్యమూ గల నటులనేకమంది అవసరం. చిత్రంలో ప్రజలను బలంగా ఆకర్షించే తారలు కొద్దిమందే ఉన్నప్పటికీ, చిత్రాన్ని విజయవంతంచేయటానికి నటులందరూ చక్కగా నటించాలి, పాత్రలనూ సన్నివేశాలనూ పోషించాలి. "మిస్సమ్మ"లో నాయికా నాయకులు ఒక ప్రొప్రయిటరు దగ్గిరికి ఉద్యోగంకోసం పోతారు. ఈ

జరుగుతూండగా గుమ్మడి స్కూలు నాటకాలలో పాత్ర

సినిమా చిత్రాలు రక్తి కట్టటానికి రకరకాల వ్యక్తిత్వమూ, నటనా సామర్థ్యమూ గల నటులనేకమంది అవసరం. చిత్రంలో ప్రజలను బలంగా ఆకర్షించే తారలు కొద్దిమందే ఉన్నప్పటికీ, చిత్రాన్ని విజయవంతం చేయటానికి నటులందరూ చక్కగా నటించాలి, పాత్రలనూ సన్నివేశాలనూ పోషించాలి. “మిస్సమ్మ” లో నాయికా నాయకులు ఒక ప్రొప్రయిటరు దగ్గరికి ఉద్యోగం కోసం పోతారు. ఈ పాత్ర ఈ ఒక్క ఘట్టంలోనే కనిపిస్తుంది. కాని చిత్రం చూసినవారెవరూ ఈ పాత్రను మరిచిపోలేదు. ఈ పాత్రను రక్తికట్టించినవాడు గుమ్మడి వెంకటేశ్వరరావు.

గుమ్మడి సినిమా ప్రేక్షకులకు కొత్తవాడు కాదు. అతను 1950 నుంచీ సినిమాలలో నటిస్తున్నాడు. “మిస్సమ్మ” తరువాత విడుదలయిన “అర్థాంగి”లో అతను ధరించిన జమీందారు పాత్ర అందర్నీ ఆకర్షించింది. అతను ధరించిన ఏ పాత్రను బట్టీ అతని వయసు ఊహించటం సాధ్యం కాదు _ అతను 1927 జులై 9 న పుట్టాడు.

గుమ్మడి స్వగ్రామం తెనాలి తాలూకాలోని రావికంపాడు. తండ్రి బసవయ్య గారు మధ్యతరగతి రైతు. వెంకటేశ్వరావుకు ముగ్గురు తమ్ములూ, ఒక చెల్లెలూ ఉన్నారు. వారంతా చదువుకుంటున్నారు.

గుమ్మడి హైస్కూలు చదువు 4 వ క్లాసునుంచి స్కూలు ఫైనల్ దాకా కొల్లూరులోనే సాగింది. రావికంపాడుకు కొల్లూరు మూడు మైళ్ళుంటుంది. 4వ ఫారం జరుగుతూండగా గుమ్మడి స్కూలు నాటకాలలో పాత్రధారణ ప్రారంభించాడు. ఆ ఏడే (1942) “రైతు బిడ్డ” అనే నాటికలో రైతుగా మొదటి బహుమానం కొట్టాడు.

అతను 1944 లో స్కూలు చదువు పూర్తిచేసి, ఇంటర్ చదవటానికి గుంటూరు వెళ్ళి హిందూ కాలేజీలో ప్రవేశించాడు. ఈ ఏడు అతని వివాహం కూడా అయింది. కాలేజీలో చేరాక అతనికి చదువుమీద రక్తి తగ్గింది. రాజకీయాలు అతన్ని బలంగా ఆకర్షించాయి. ఆ ధోరణిలో అతను రాజకీయాలలో ప్రవేశించినా అతను రాణించి ఉండేవాడేనేమో ! ఎందుకంటే వక్తృత్వంలో అతని కాలేజీకి అతనే ఫస్టు. ఆ కారణం చేతనే ఇంటర్ కాలేజ్ వక్తృత్వ పోటీకి హిందూ కాలేజి తరఫున అతనే పంపబడ్డాడు. నాటకాలు ఉండనే వున్నాయి. కాలేజీలో చదివిన కాలంలో అతను మూడు నాటకాలలో పాల్గొన్నాడు. అందులో ఒకటి విశ్వవిద్యాలయ నాటకపోటీలో ఆడినది. 1946లో ఇంటర్ కొద్దిగా పాసై గుమ్మడి చదువుకు వీడ్కోలు చెప్పి స్వగ్రామం చేరాడు.

ఇక్కడ అతను 1948 దాకా ఉన్నాడు. ఈ రెండేళ్ళలోనూ అతను చేసిన పని స్థానిక నాట్యమండలి ఒకటి నెలకొల్పి, నటులను తయారు చేసి, నాటకాలాడించటం. ఈ నాటక సమాజం వారు "వీరాభిమన్యు", "ఖిల్జీ రాజ్య పతనం", "నాయకురాలు" నాటకాలాడారు. అందులో దుర్యోధనుడు, గఫూర్ ఖాం, బ్రహ్మనాయుడు పాత్రలను గుమ్మడి ధరించాడు.

ఈ విధంగా రెండేళ్ళు వెళ్ళబుచ్చి గుమ్మడి తెనాలి చేరి, మరి ఇద్దరి భాగస్వాములతో అక్కడ రేడియో, ఎలెక్ట్రికల్ సామాగ్రి దుకాణం ఒకటి పెట్టాడు. కాని ఈ దుకాణం అతని జీవితాశయ సాఫల్యంగా కనిపించలేదు. సినిమా నటుడు కావాలనే కాంక్ష తరుముతోంది. డైరెక్టర్ ప్రసాద్ గారికి, చక్రపాణి గారికీ, అప్పుడప్పుడే సినిమా రంగంలోకి అడుగుపెట్టిన ఎన్.టి.రామారావుకూ ఉత్తరాలు వ్రాశాడు. అవకాశం ఉంటే తెలియజేస్తామని మొదటి ఇద్దరూ సమాధానాలు రాశారు. తనకే యింకా స్థావరం చిక్కలేదని ఎన్.టి.రామారావు రాశాడు.

ఇలా వుండగా "శ్రీ లక్ష్మమ్మ కథ" లో శేషమాంబను బుక్ చేయటానికి డి.ఎల్. నారాయణ గారు తెనాలి వచ్చారు. శేషమాంబ భర్త, గుమ్మడి వెంకటేశ్వరరావును బాగా ఎరుగును. ఆయన డి.ఎల్.గారిని అతని దుకాణానికి తీసుకువచ్చాడు. డి.ఎల్. గారు గుమ్మడి ఫోటోలు కొన్ని తీసుకుని మద్రాసుకు తిరిగి వెళ్ళారు.

ఈ ఫోటోలు వృథాపోలేదు. సౌందరరాజన్ అయ్యంగారు డి.ఎల్.తో తాను కొత్త నటీనటులతో తెలుగు పిక్చరు తీయ సంకల్పించినట్టు చెప్పారు. డి.ఎల్. గారు గుమ్మడి ఇచ్చిన ఫోటోలను సౌందర రాజన్ అయ్యంగారికిచ్చారు. వెంటనే మద్రాసుకు బయలుదేరి రావలిసిందని సౌందరరాజన్ అయ్యంగారు గుమ్మడికి తంతి ఇచ్చారు. ఆ తంతి ఇచ్చిన వ్యక్తి ఎవరో కూడా గుమ్మడికి తెలియదు. అయినా అతను బయలుదేరి మద్రాసు చేరాడు. చేరిన రోజునే ఎగ్రిమెంట్ పై సంతకం కూడా అయిపోయింది.

సౌందరరాజన్ అయ్యంగార్ తీసిన చిత్రం "అదృష్టదీపుడు". అందులో గుమ్మడి ఒక సేనా నాయకుడి పాత్ర. చిన్న పాత్ర నటించాడు. "అదృష్ట దీపుడు" పూర్తి అవుతూనే అయ్యంగారు "నవ్వితే నవరత్నాలు" ప్రారంభించి అందులో గుమ్మడికి కథానాయిక తండ్రి పాత్ర ఇచ్చారు. ఆ పాత్రను గుమ్మడి తృప్తికరంగా నిర్వహించాడు.

ఇప్పుడు గుమ్మడికి మద్రాసులో ఉన్న ఆత్మీయులలో ఎన్.టి.రామారావూ, గోపీచంద్ గారూ ఉన్నారు. గోపీచంద్ గారిని అతను తెనాలిలోనే ఎరుగును. గోపీచంద్ గారు గుమ్మడిని తమ మూడు చిత్రాలలో "పేరంటాలు", "ప్రియురాలు", "పాలేరు" లలో బుక్ చేశారు. "పేరంటాలు" లో గుమ్మడి ధరించిన పాత్ర చాలా చిన్నది. "ప్రియురాలు" లో అతను మళ్ళీ కథానాయిక తండ్రిగా వృద్ధ పాత్ర ధరించాడు. "పాలేరు" లో గుమ్మడి ధరించిన పాత్ర జమీందారు పాత్ర చాలా ముఖ్యమైనది. కాని దురదృష్టవశాత్తూ ఈ చిత్రం పూర్తికాలేదు.

ఈ సమయంలో ఎన్.టి.రామారావు ఆప్తవర్గం కొందరు కలిసి "పిచ్చి పుల్లయ్య" చిత్రం ప్రారంభించారు. ఈ చిత్రంలో గుమ్మడికి మొదటిసారిగా ఒక బలమైన, బరువైన పాత్ర విలన్ భూపాలరావు పాత్ర దొరికింది. ఈ పాత్రను గుమ్మడి విజయవంతంగా నిర్వహించి మంచిపేరు తెచ్చుకున్నాడు.

ఈ చిత్రం అనంతరం రాయలసీమ క్షామ నివారణకుగాను ఎన్.టి.రామారావు ఒక ట్రూప్ తీసుకుని ఆంధ్ర పర్యటనకు బయలుదేరాడు. ఈ ట్రూప్ లో గుమ్మడికూడా ఉన్నాడు. వీరు ఆంధ్రలో వుండగా హెచ్.ఎం.రెడ్డిగారు గుమ్మడికి ఒక తంతి పంపించారు. "ప్రతిజ్ఞ" లో ఒక పాత్ర ధరించమని.

"ప్రియురాలు" షూటింగ్ రోహిణీ స్టూడియోలో జరిగినప్పుడు హెచ్.ఎం.రెడ్డిగారు గుమ్మడిని వృద్ధపాత్రలో చూసి వున్నారు. అతని నటన ఆయనకు నచ్చింది; తంతి ఇచ్చారు. అయితే ఈ తంతి గుమ్మడికి అందలేదు. ట్రూప్ మద్రాసుకు తిరిగివచ్చాకే, తనకు "ప్రతిజ్ఞ"లో ఒక పాత్ర వున్న సంగతి గుమ్మడికి తెలిసింది.

దీని తరువాత గుమ్మడి నటించినది "తోడు దొంగలు" లో లోకనాథం. దుర్మార్గమూ, హాస్యమూ మిళితమై ఉన్న ఈ పాత్రను గుమ్మడి చాలా జాతీయంగా, సహజంగా, రక్తిగా నిర్వహించాడు. "తోడు దొంగలు" తరువాత అతను నటించిన "మిస్సమ్మ", "అర్ధాంగి" చిత్రాలు ఇంకా ఆంధ్రలో నడుస్తూనే వున్నాయి.

నటుడుగా గుమ్మడికి అనేక రకాల మనస్తత్వాలను చిత్రించగల నేర్పూ అనేక వయస్సులను స్ఫురింపజేయగల చాక చాక్యమూ ఉన్నాయి. తాను ధరించే పాత్రను పూర్తిగా అర్థం చేసుకుని నటించేటప్పుడు అందులో పూర్తిగా లీనమై, తన వ్యక్తిత్వాన్ని ఎంత మాత్రమూ బయటపడనివ్వకుండా నటించే అపూర్వ సామర్థ్యం చాలా కొద్దిమంది నటులకే ఉంది. వారిలో నిస్సందేహంగా గుమ్మడి వెంకటేశ్వరరావు ఒకడు.

ప్రస్తుతం గుమ్మడి "విజయగౌరి"లో వీరసింహుడు విలన్ గానూ, "బీదల ఆస్తి" లో జమీందారుగానూ, నేషనల్ ఆర్ట్ వారి చిత్రంలో రణధీర్ అనే కుంటి మాజీ సిపాయిగానూ నటిస్తున్నాడు. "వదినె", "బాల సన్యాసమ్మ కథ", "చాయ" చిత్రాలలో కూడా గుమ్మడికి వేషం ఉంది.

★★★

COMMENTS